క్లుప్తంగా

పొంగి ప్రవహిస్తున్న శారదా, తాచేరు


శారదా నదిలో చేరిన వర్షపు నీరు

మాడుగుల రూరల్: అడపాదడపా కురుస్తున్న వర్షాలు వరినాట్లకు ఎంతో మేలు చేస్తున్నాయి. దీనికి తోడు మండలంలో శారదా, తాచేరు, పాలగెడ్డ, చింతగెడ్డలో నీరు చేరుతోంది. ఈ వర్షాలకు చెరువుల్లో సాగునీరు పుష్కలంగా చేరింది. మండలంలో వరినాట్లు దాదాపు ఆఖరి దశకు చేరాయి. మెట్ట భూముల్లో వరి నాట్లు జోరుగా వేస్తున్నారు. ఈ వర్షాలు చెరకు తోటలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా పార్థసారథి స్వామి ఊరేగింపు


పార్థసారథి స్వామి ఊరేగింపులో అర్చకులు

మాడుగుల: పురాతన పార్థసారథి స్వామి ఆలయంలో ఆదివారం కృష్ణాష్టమి ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పూర్వకాలం నుంచి ఇక్కడ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఏటా నిర్వహిస్తుంటామని అర్చకులు తెలిపారు.

ముమ్మరంగా వరినాట్లు


గుల్లేపల్లిలో నాట్లు వేసే పనుల్లో రైతులు

కె.కోటపాడు: మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సాగు నీటి చెరువుల్లోకి కొద్దిపాటిగా నీరు చేరింది. ఖరీఫ్ ప్రారంభం తర్వాత వర్షాభావ పరిస్థితులలో పలు గ్రామాల్లో వరినాట్లు పడలేదు. వ్యవసాయ బావులు, బోర్లు ఆధారంగా ఇప్పటి వరకు వరినాట్లు వేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో పొలాల్లోకి వర్షపునీరు చేరడంతో పొలాలను దమ్ములు పట్టి నాట్లు వేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. గుల్లేపల్లి, గొండుపాలెం, రామచంద్రపురం, సింగన్నదొరపాలెం తదితర గ్రామాల్లో నాట్లు వేస్తున్నారు.

ఇంటింటి ధర్మ ప్రచారం


ఇంటింటి ధర్మ ప్రచారం నిర్వహిస్తున్న మహిళలు

పాయకరావుపేట : సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఇంటింటి ధర్మ ప్రచారం నిర్వహించనున్నట్లు సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ నీలాపు వెంకటరెడ్డి తెలిపారు. 15వ విడత కార్యక్రమంలో భాగంగా ఇది జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఆదివారం బంగారయ్యపేట గ్రామంలో పలువురు మహిళలతో ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారక్ కట్టా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కులను పరిరక్షించాలి

రంపచోడవరం: అటవీ సంరక్షణ(సవరణ) చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12 ,13 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే అఖిలభారత ఆదివాసీ సదస్సును విజయవంతం చేయాలని ఏజెన్సీ గిరిజన సంఘం అధ్యక్షుడు వంజం జోగారావు దొర కోరారు. కేంద్ర ప్రభుత్వం అటవీ సంరక్షణ చట్టాన్ని సవరణ చేసి అడవిలో సహజ సంపదలను, ఖనిజాలను సామ్రాజ్యవాదులకు కట్టబెట్టేందుకు చూస్తుందని ఆరోపించారు. ఆదివాసీ హక్కులను పరిరక్షించుకోవాలని కోరారు. ఆదివాసీ సదస్సుకు పది రాష్ట్రాల నుంచి రైతుకూలీ, కార్మిక నేతలు హాజరవుతున్నారన్నారు.

చంద్రబాబుకు తగిన గుణపాఠం

చట్టం ముందు ఎంతటి వారికైనా శిక్ష తప్పదని చంద్రబాబు ఉదంతమే నిదర్శనం.. గత టీడీపీ పాలనలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని దోచుకోవడమే కాకుండా తాను సచ్ఛీలుడినని, నిప్పునని ప్రగల్భాలు పలుకుతూ ప్రజలను మభ్య పెడుతున్న ఆయనకు జైలు శిక్ష తప్పదని ప్రజలు విశ్వసిస్తున్నారు. తాజాగా కోర్టు రిమాండ్ విధించడంతో పలువురు సాక్షితో తమ మనోభావాలు వ్యక్తం చేశారు. – సాక్షి నెట్‌వర్క్

చట్టం ముందు అందరూ సమానమే...



కోర్టు తీర్పు వల్ల ఎంతటి వ్యక్తి అయినా చట్టం ముందు సమానమే అన్న మంచి సందేశం సమాజానికి వెళ్తోంది. ఇలాంటి తీర్పులు ఇంకా రావాలి. ఎంతో మంది ముఖ్యమంత్రులు జైలుకు వెళ్లారు. తీర్పులు వచ్చాయి. అయితే ఇది ఫైనల్ తీర్పు కాదు.. అవినీతి నిర్ధారించబడితే అప్పుడు శిక్ష..! ఇది రిమాండ్ మాత్రమే. ఇలాంటివి ఫాస్ట్ ట్రాక్ కోర్టులో న్యాయప్రక్రియ జరిగి తీర్పులు వేగవంతం చేయాలి.. సత్వర న్యాయం జరగాలి. ఇలాంటి తీర్పు వల్ల చట్టాలు కోర్టుల మీద సామాన్య ప్రజలకు నమ్మకం కలుగుతుంది.. ఆహ్వానించదగ్గ పరిణామం.

– ఆర్క్ ప్రసాద్, ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ రీ కన్‌స్ట్రక్షన్ (ఆర్క్), చోడవరం

అబద్ధాలతో ప్రజలను మోసగిస్తున్న చంద్రబాబు



అబద్ధాలతో ప్రజలను ఇప్పటి వరకూ మోసం చేసిన మాజీ సీఎం చంద్రబాబు అసలు స్వరూపం ఎట్టకేలకు బయట పడటం హర్షణీయం. స్కిల్ స్కాం కేసులో ఆయన వందల కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టించడం వల్లే అరెస్టయ్యారు. ఈ స్కాంలో చిక్కుకున్న వారికి కఠిన జైలు శిక్ష విధిస్తే రాజకీయాల్లో అవితినీకి పాల్పడటానికి ఆలోచిస్తారు. అవినీతి చక్రవర్తి చంద్రబాబు నుంచి నిధులు స్వాధీనం చేసుకోవాలి.

– ఈర్లె అనురాధ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు

తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు



తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో యువతను మోసం చేసిన మాజీ సీఎం చంద్రబాబుకు రిమాండ్ ఇవ్వడంలో ఎటువంటి తప్పులేదు. ఆయన అనేక అక్రమాలకు పాల్పడ్డారు. చట్టం నుంచి తప్పించుకుంటున్నారు. యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో కోట్లాది రూపాయలు స్వాహా చేసి ప్రజా విశ్వాసం కోల్పోయారు.

– సుందర బుజ్జి, లింగంపేట, గొలుగొండ మండలం

ప్రజల దృష్టి మరల్చడానికి టీడీపీ రాద్ధాంతం



అడ్డంగా దొరికిన మాజీ సీఎం చంద్రబాబు తన అవినీతి నుంచి ప్రజలను దృష్టి మరల్చడాన్నికి ఆ పార్టీ నేతలు రాద్ధాంతం చేస్తున్నారు. తన హయాంలో నీతిమంతమైన పాలన అందించానని, తాను నిప్పునని పలు సభల్లో పగల్భాలు పలికిన అవినీతిపరుడని ప్రజలు గుర్తించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని నిరంతరం విమర్శించే చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్‌లో నిధులు పక్కదారి పట్టించడంతోనే కటకటాల పాలయ్యారు. ముందస్తుగా తన అరెస్టు గురించి పలు సభల్లో ప్రస్తావించారంటే ఆయనకు ముందే ఈ విషయం తెలిసిందన్నారు.

– కాళ్ల రాము, న్యాయవాది, కె.జె.పురం, మాడుగుల మండలం

భారీ వర్షంతో చెరువులకు జలకళ

- అలుగులు మీదుగా పొంగి ప్రవహిస్తున్న వర్షపు నీరు


చిననందిపల్లిలో పారమ్మ చెరువు వద్ద అలుగు మీదుగా పొంగి ప్రవహిస్తున్న వర్షపునీరు


వర్షపు నీటితో కళకళలాడుతున్న నాగయ్యపేట సన్యాసి చెరువు

దేవరాపల్లి: మండలంలో రెండు రోజుల క్రితం కురిసిన కుండపోత వర్షంతో చెరువులన్నీ వర్షపునీటితో కళకళలాడుతున్నాయి. భారీ వర్షం ధాటికి చెరువులు నిండి అలుగులు మీదుగా దిగువకు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇంతవరకూ అడుగంటిన చెరువులు భారీ వర్షంతో కనుచూపు మేర నీటి జాడలు దర్శనమిస్తున్నాయి. చిననందిపల్లి వద్ద బొడ్డవాని చెరువు, పారమ్మ చెరువులకు వర్షపునీరు పోటెత్తడంతో అలుగు మీదుగా పొంగి ప్రవహించి, పెదనందిపల్లి సాగరం చెరువులోకి చేరుతోంది. మండలంలోని చెరువులన్నీ నిండుగా దర్శనమివ్వడంతో ఖరీఫ్ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ పంటలకు సాగు నీటికి ఢోకా ఉండబోదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంతంగా ఉపకార వేతనాలకు అర్హత పరీక్ష


పరీక్షకు హాజరైన విద్యార్థులు

మాడుగుల రూరల్: సృజనవాణి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉపకార వేతనాలకు అర్హత పరీక్షకు 190 మంది విద్యార్థులు హాజరయ్యారని సంస్థ సమన్వయకర్త కె. జానీ తెలిపారు. స్కాలర్‌షిప్ అనే ప్రోగ్రామ్ ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, నర్సింగ్ చదువుతున్న 250 మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా వడ్డాది, చోడవరం, మాడుగుల, మండలాల నుంచి 190 మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు. వీరిలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు.

కనకదుర్గమ్మకు పసుపు కుంకుమలు


నూకాంబిక ఆలయం నుంచి పసుపు, కుంకుమ తీసుకెళ్తున్న ఆలయ చైర్మన్ మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మకు నూకాంబిక ఆలయం తరపున ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ ఆదివారం పసుపు, కుంకుమలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా రాబోయే దసరా వేడుకల నేపథ్యంలో కనకదుర్గమ్మకు పసుపు, కుంకుమలను సంప్రదాయంగా సమర్పించినట్లు తెలిపారు. శరన్నవరాత్రులను అమ్మవారి ఆలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తొమ్మిది రోజులూ బాలాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో దుర్గమ్మ ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణ, ఆలయ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పొలిమేర శ్రీను, దాడి అప్పలనాయుడు, పెంటకోట లక్ష్మీనారాయణ, సూరిశెట్టి తేజ పాల్గొన్నారు.

హనుమత్ మహా యజ్ఞం పాదయాత్ర


హనుమత్ మహా యజ్ఞం పాదయాత్రలో భక్తులు

కశింకోట: కశింకోట వద్ద కనకదుర్గమ్మ ఆలయం నుంచి శ్రీహనుమత్ కోటి నామ లిఖిత మంత్రజప మహా యజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఆదివారం భక్తులు పాదయాత్ర నిర్వహించారు. ఆలయం నుంచి ప్రారంభమైన పాదయాత్ర జాతీయ రహదారి, సంతబయల, పెద బజారు మీదుగా స్థానిక దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన వేణుగోపాల స్వామి ఆలయం వద్దనున్న మారుతి విద్యా పీఠం వరకు సాగింది. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, యువ చారిటబుల్ ట్రస్టు, మారుతి విద్యా పీఠం అధ్యక్షుడు రేజేటి మారుతి తదితరులు పాదయాత్రలో పాల్గొన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఆదివారం సీఆర్‌పీఎఫ్ పోలీసులు, ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో ఆదివారం ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రయాణికుల బ్యాగులు, లగేజీలను పరిశీలించారు. అనుమానితులను ప్రశ్నించి విడిచి పెట్టారు. గత రెండు రోజులుగా రాత్రిళ్లు సైతం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తూ ప్రభుత్వ కార్యాలయాల వద్ద గస్తీని ఏర్పాటు చేశారు. వాహనచోదకుల రికార్డులు పరిశీలించి, ప్రతి ఒక్కరూ వాహనాలకు సంబంధించిన పత్రాలు కచ్చితంగా కలిగి ఉండాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తుంచుకుని సహకరించాలని ఎస్ఐ రవీంద్ర కోరారు. సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులున్నారు.

నేడు గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు

మాడుగుల రూరల్: ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్ యోజనలో భాగంగా సోమవారం పీహెచ్‌సీల్లో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేయనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. కింతలి, కె.జె.పురం పీహెచ్‌సీల్లో ఉదయం 9 గంటల నుంచి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని వైద్యాధికారులు కె.ఎం.నాయుడు, ఎల్.వి.ఎస్.ఎస్. ప్రసాదుపాత్రుడు తెలిపారు.

విద్యుదాఘాతంతో నాలుగు గొర్రెల మృతి


మృత్యువాత పడ్డ గొర్రెలు

నక్కపల్లి: మండలంలో వేంపాడులో ఆదివారం విద్యుదాఘాతానికి గురై నాలుగు గొర్రెలు మృతి చెందాయి. అల్లు అప్పారావుకు చెందిన నాలుగు గొర్రెలు రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభానికి ఉన్న సపోర్ట్ వైరు తగలడంతో షాక్‌కు గురయ్యాయి. మృతి చెందిన గొర్రెల విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని బాధితుడు అప్పారావు కోరారు.

నూకాంబిక ఆలయానికి రూ.50 వేలు విరాళం

అనకాపల్లిటౌన్: స్థానిక ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక ఆలయ అభివృద్ధికి విశాఖకు చెందిన కెవీఎల్ఎన్ మూర్తి రూ.50 వేలు విరాళం ఇచ్చారు. ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణకు ఈ విరాళాన్ని ఆదివారం అందించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్న విషయం తెలిసి, అమ్మవారికి ప్రీతిపాత్రమైన ఆదివారం అమ్మవారి దర్శించుకుని ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నూతన పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మరిన్ని సేవా కార్యక్రమాల్లో వాకర్స్ క్లబ్

అనకాపల్లిటౌన్: వాకర్స్ క్లబ్ సభ్యులను ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు శివ చెప్పారు. క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. 2023–24 ఏడాదిలో క్లబ్ చేపట్టబోయే సేవా కార్యక్రమాలపై చర్చించారు. గత ఏడాది ఎంపికైన క్లబ్ సభ్యుల పదవీ కాలాన్ని మరో ఏడాది కాలానికి పొడిగిస్తూ క్లబ్ సభ్యులు ఏకగ్రీవంగా అంగీకరించారు. కార్యక్రమంలో సభ్యులు వైద్యులు బి.వి.రమణ, కె.విష్ణుమూర్తి, డి.డి.నాయుడు, కర్రి హనుమంతరావు, ఆదారి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామకోటి స్థూపం ఆవిష్కరణ


పల్లకిలో సీతారాములను ఊరేగిస్తున్న దృశ్యం

నక్కపల్లి : మండలంలో చినదొడ్డిగల్లు శ్రీరామ పంచాయతన ఆలయంలో ఆదివారం రామకోటి స్థూపం ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ ధర్మకర్త శ్రీపాద సత్యదేవశర్మచే ఈ స్థూపం నిర్మించబడింది. విజయనగరానికి చెందిన ప్రముఖ సహస్రావధాని బ్రహ్మశ్రీ కోట లక్ష్మీనరశింహం దంపతులచే ఈ స్థూపాన్ని ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. సీతారాముల ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం వేదపండితులతో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మండపారాధన, పుణ్యనదీ జలాలతో సీతారాముల మూల విరాట్‌కు పట్టాభిషేక మహోత్సవం, వేదపారాయణం, శ్రీరామనామ పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హోమం, పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పాలు, ఆశీర్వచనం కార్యక్రమాలు జరిగాయి.

సత్యసాయి మందిర నిర్మాణానికి భూమి పూజ

సామాజిక భవనానికి డిప్యూటీ సీఎం రూ. 5 లక్షల మంజూరు


సత్యసాయి మందిరం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: నూతనంగా నిర్మిస్తున్న పార్కును అనుకున్న స్థలంలో భగవాన్ సత్యసాయి బాబా ధ్యాన మందిరం నిర్మాణానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సత్యసాయి ఆలయానికి అనుకుని సామాజిక భవన నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయింపుతోపాటు సామాజిక భవనానికి నిధులు మంజూరు చేసిన ఆయనకు సత్యసాయి భక్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు నారాయణమ్మ, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు వి.కృష్ణంరాజు, సేవాదళ్ సమన్వయకర్త కె. అప్పలనాయుడు, సూర్యం, శంకరరావు, రవి శంకర్ పాల్గొన్నారు.

మోదకొండమ్మకు శ్రావణ పూజలు


మోదకొండమ్మను అలంకరించిన దృశ్యం


ప్రత్యేక అలంకరణలో కె.జె.పురం మోదమాంబ

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో శ్రావణమాసం ఆదివారం సందర్భంగా ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఆభరణాలు, పుష్పాలతో అలంకరించారు. ఆలయ కమిటీ భక్తులకు ఉచితంగా ప్రసాదం అందజేసింది. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.


మాడుగుల రూరల్: కె.జె.పురం మోదమాంబ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. గ్రామస్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రికి ఆలయంలో భజనలు ఏర్పాటు చేశారు. చెరకు కాటా ఆవరణలో నూకాంబిక ఆలయంలో పూజలు నిర్వహించారు. సాయంత్రం నుంచి భజన కార్యక్రమం జరిగింది. ఎం.కె.వల్లాపురం కాటా ఆవరణలో మోదమాంబ ఆలయంలో, సాగరం మోదమాంబకు పూజలు నిర్వహించారు.

జీవకారుణ్య సంఘ భవనంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సంఘ సభ్యులు

రోలుగుంట: స్థానిక జీవకారుణ్య సంఘ భవనంలో సంఘ సభ్యులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. 1965లో నిర్మించిన ఇక్కడ భవనం శిథిలం కావడంతో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని, అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మలను ఆర్నెల్ల క్రితం కలిసి పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన విప్ ధర్మశ్రీ ఆదేశాల మేరకు జెడ్పీటీసీ రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో మండల పీఆర్ జేఈ ఉమామహేశ్వరుడు పర్యవేక్షణలో అనుబంధ సంఘం సిద్ధి వినాయక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకిరెడ్డి శ్రీను, టాన్స్‌పోర్ట్ సత్తిబాబు ముందుకొచ్చి శరవేగంగా పనులు చేస్తున్నారు. ఇక్కడ నవరాత్రోత్సాల నిర్వహణకుగాను ఇక్కడ సంఘ పౌండర్ గైరమ్మ సత్యం దంపతులతో వినాయక పూజ చేయించి లాంఛనంగా భవన ప్రవేశం చేశారు. సంఘ సభ్యులు సుర్ల నాయుడు, కొట్టే సంజీవి, ఆడారి గణేష్ పాత్రో, మద్దు శ్రీను, ఆడారి వాసు, సిద్ధి వినాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మదిని దోచే మన్యం అందాలు


పరుచుకున్న పచ్చదనం

డుంబ్రిగుడ: ప్రస్తుతం మన్యం వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో ఎటుచూసినా ప్రకృతి అందాలు దర్శనమిస్తున్నాయి. గడిచిన కొద్ది రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో పంట పొలాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. మండలంలోని గుంటగన్నెల పంచాయతీ జాముగుడ గ్రామంలోని ఎత్తైన కొండల మధ్య వరి పంటల సాగుతో ప్రకృతి అందాలు కట్టిపడేస్తున్నాయి.

ఆకట్టుకుంటున్న దాలియా పుష్పాలు


కోల్లాపుట్టులో నీలిరంగు దాలియా పుష్పాలు

ఆంధ్రా–ఒడిశాసరిహద్దు ప్రాంతంలోని కోల్లాపుట్టు పంచాయతీ మారుమూల ప్రాంతమైన ఎగువ కోల్లాపుట్టు, డెక్కపారు గ్రామాల్లోని గొల్లోరి దామోదర్, సుశీల అనే గిరిజనుల ఇంట్లో విరగ్గాసిన దాలియా అందాలు ఆకట్టుకుంటున్నాయి. ఈ మార్గంలో వెళ్లున్న వాహనచోదకులకు పూల అందాలు కట్టిపడేస్తున్నాయి. దీంతో అలాగే పూల అందాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తజనం


ఆలయ మండపంలో భక్తుల కోలాహలం

అనకాపల్లిటౌన్: గవరపాలెం నూకాంబిక ఆలయానికి ఆదివారం భక్తులు బారులు తీరారు. శ్రావణ మాసం నాలుగో ఆదివారం కావడంతో అమ్మవారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్, చైర్మన్ కొణతాల మురళీకృష్ణలు ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని ఉడ్‌పేటకు చెందిన ఆకులేటి సూర్యనారాయణ, లలిత దంపతులు అర తులం బంగారు శతమానాలను అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.